మార్కెట్లో వసతులు కరువు

- బోథ్ మార్కెట్‌యార్డుపై అధికారుల నిర్లక్ష్యం
- పంటలు తింటున్న పశువులు
- విశ్రాంతి భవనం లేక రైతుల ఇబ్బందులు


మొక్కజొన్న పంటను తింటున్న ఆవు


చెట్టు కింద కూర్చున్న రైతులు

బోథ్: బోథ్ మార్కెట్ యార్డు ఆదాయం కోట్లలో ఉంటుంది. ఆదిలాబాద్ తరువాత ఈమార్కెట్‌కే ఎక్కువ ఆదాయం వస్తోంది. కానీ రైతులకు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతులు మార్కెట్‌కు తెచ్చిన పంటకు కూడా రక్షణ లేకుండా పోతోంది. ఎండాకాలంలో రైతులకు ఉండేందుకు విశ్రాంతి భవనం కూడా లేదు

పర్యవేక్షణ లేకపోవడంతో..

బోథ్ మార్కెట్‌యార్డులో ప్రతీ సంవత్సరం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయాబీన్, మొక్కజొన్న, శనగలు, జొన్న పంటలు కొనుగోలు చేస్తారు. కొనుగోళ్లు జరుగుతున్న క్రమంలో రైతులు తమ పంటలను కుప్పలుగా వేసి సంచుల్లో నింపుతారు. అయితే రాత్రి సమయంలో కొంతమంది రైతుల పంటలోని కొన్ని సంచులు మాయమైన దాఖలాలు ఉన్నాయి. ఆవులు మార్కెట్ యార్డులోకి చొరబడి పంటలను తింటున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెట్ల నీడే దిక్కు..

రైతులు పంటలను మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చినప్పుడు రైతులు సేదతీరేందుకు విశ్రాంతి భవనం ఉండాలి. కానీ మార్కెట్ యార్డుల విశ్రాంతి భవనం లేదు. మార్క్‌ఫెడ్ అధికారులు ఉంటున్న భవనాన్ని చూపి విశ్రాంతి భవనంగా పేర్కొంటున్నారు. దీంతో రైతులు చెట్టుకిందనే విశ్రాంతి తీసుకుంటున్నారు. తాగేందుకు ఒక నీటి డబ్బాను ఏర్పాటు చేశారు. ఈనీరు వేడిగా ఉండడంతో రైతులు ఆ నీటిని తాగలేకపోతున్నారు.

వృథాగా కాంటాలు..

రైతులు పండించిన పంటను మార్కెట్ యార్డులో కొనుగోలు చేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలైనా, ప్రైవేటు వ్యాపారస్తులైనా మార్కెట్‌లోనే కొనుగోలు చేయాలి. మార్కెట్ యార్డులోనే తూకం వేయాలి. ఇందుకోసం మార్కెట్ యార్డులో ఎడ్లబండి కాంటాలు, లారీ కాంటాలు ఉన్నాయి. కానీ బోథ్ మార్కెట్ యార్డులో ఈపరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రమే మార్కెట్ యార్డులో పంటలను కొంటున్నాయి. ప్రైవేట్ వ్యాపారస్తులు మాత్రం జిన్నింగ్ మిల్లుల్లో ఉన్న కాంటాల్లోనే తూకం వేస్తున్నారు. దీంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన కాంటాలు వృథాగా ఉంటున్నాయి. మరోవైపు మార్కెట్‌యార్డులో కొంతమేర ప్రహరీ కూలిపోయింది. తాత్కాలికంగా కంచె ఏర్పాటు చేశారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి



బోథ్ మార్కెట్ యార్డులో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విశ్రాంతి భవనం లేకపోవడంతో ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు గోదాంలో, చెట్ల కింద ఉంటున్నారు. రైతులకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలి.యార్డులోకి పశువుల రాకుండా అధికారులు చొరవ చూపాలి.

– బొడ్డు శ్రీనివాస్, రైతు, బోథ్

అటెన్షన్ ప్లీజ్.. వంతెన లేక అవస్థలు



బజార్‌హత్నూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లే బండ్రేవు వాగుపై వంతెన లేక ఆదివాసీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో రేషన్, వారసంతకు రాకపోకలు, ఎరువులు తీసుకవెళ్లాలన్నా.. ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: నర్సింగ్, ఏఈ పీఆర్, ఫోన్: 96763 43109

కూలీలకు వసతులు కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఉపాధిహామీ కార్మికులకు వసతులు కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి కోరారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి గ్రామ శివారులో పని చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడి అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు రావడం లేదని కూలీలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. పని చేసిన కార్మికులకు వెంటనే డబ్బులు చెల్లించి, పని ప్రదేశంలో వసతులు కల్పించాలన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఉట్నూర్‌రూరల్: పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ జైవంత్ రావు అన్నారు. బుధవారం మండలంలోని శ్యాంపూర్ పీహెచ్‌సీలో జనఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు కొనుగోలు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, సర్పంచ్ మల్లిక, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయ్, వైద్యులు సందీప్ రాథోడ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు ప్రజల వద్దకు ప్రజావాణి

కైలాస్‌నగర్: పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజల వద్దకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 26న పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శైలజ ప్రకటనలో తెలిపారు. 1, 2 వార్డుల్లోని ప్రజలు తాగునీరు, వీధి దీపాలు, ఇంటి నెంబర్ల కేటాయింపు, పేరు మార్పిడి, కొలతలు, పేర్లలో తప్పులు, పెన్షన్లు వంటి మున్సిపల్ సేవల కోసం సంప్రదించవచ్చన్నారు.

29న ఆత్మీయ సమ్మేళనం

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి (టి)లో ఈ నెల 29న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నాగయ్య తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఆత్మీయ సమ్మేళనంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జేపీఎల్ పోటీల్లో సెంచరీ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జూనియర్ ప్రీమియర్ లీగ్ 2023 పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం జేసీఏ టైటాన్స్ మధ్య జరిగిన మ్యాచ్లో జేసీఏ టైటాన్స్ జట్టు 85 పరుగుల తేడాతో గెలుపొందింది. 166 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఛాలెంజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 80 పరుగులకే పరిమితమైంది. టైటాన్స్ విజయంలో కీలక పాత్ర పోషించిన జట్టు ఆటగాడు కశ్యప్ పటాస్కర్ 105(79) పరుగులు చేయడమే కాకుండా రెండు వికెట్లను పడగొట్టి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బేల: మండలంలోని హేటి గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హేటి గ్రామస్తులు రేషన్ కోసం ఏళ్ల నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో బాది గ్రామానికి వెళ్తున్నారని తెలిపారు. సరైన రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, స్థానికంగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాంఖడే వామన్, మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, నాయకులు గంగారెడ్డి, గావుండే గణేశ్యాం, ఎండీ అఖిల్, గోడే అవినాష్, మడావి చంద్రకాంత్, భాస్కర్, రాకేశ్, కృష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడికి అందజేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: రాజ్యాంగాన్ని ప్రతీ పౌరుడికి అందజేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావుకు అందచేశారు. రాజ్యాంగ గ్రంథం పట్ల 90 శాతం ప్రజలకు అవగాహన లేదన్నారు. కార్యక్రమంలో ధర్మసామాజ్ నాయకులు వెంకటేశ్, శేఖర్, లక్ష్మణ్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగా న్ని ప్రతిఒక్కరికీ పంచాలని ధర్మ సమాజ్ పార్టీ నా యకులు అన్నారు. ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. బుధవారం నేరడిగొండ తహసీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలం ప్రచార కమిటీ సభ్యులు దేవేందర్, శ్రీకాంత్, గంగన్న, నరేశ్, రవీందర్, సుద్దాల రాజు, ఓరగంటి రాజయ్య, బొక్కెం ఊషన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణాలు

లోకేశ్వరం: పాడి పుశువుల పెంపకం చేపట్టే రైతులకు రుణాలు అందిస్తామని.. సద్వినియోగం చేసుకోవాలని అబ్దుల్లాపూర్ ఎస్‌బీఐశాఖ మేనేజర్ తిరుమలేశ్ అన్నారు. బుధవారం మండలంలోని రాజూర గ్రామంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులను కలసి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ భైంసా బీఎంసీ కింద ఉన్న గ్రామాల్లోని లబ్ధిదారులకు త్వరలో ముద్ర రుణాలు అందజేస్తామన్నారు. వారి వెంట సూపర్‌వైజర్ దండే రమేశ్, పాలమిత్రలు ఉన్నారు.

దుర్వగూడలో తాగునీటి కష్టాలు



ఇంద్రవెల్లి: మండలంలోని మెండపల్లి పరిధిలోని దుర్వగూడ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కిలోమీటర్లు నడిచి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి నీటిని తీసుకువస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మంచి నీటి పథకాలు పని చేయడం లేదు. నీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.


నీటిని తోడుతున్న గిరిజనులు


ఎడ్లబండిపై నీటిని తీసుకెళ్తున్న ప్రజలు

రాజీయే రాజమార్గం


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి జడ్జి శివరామ ప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి జడ్జి శివరామ ప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. జూన్ 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. న్యాయవాదులు సహకరించి అధిక మొత్తంలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకుంటే సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని రాంజీగోండ్‌నగర్‌కు చెందిన కుడిమెత మధు అనారోగ్యంతో బాధపడుతూ.. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాంజీగోండ్‌నగర్, నవోదయనగర్ వాసులు మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి ఆధ్వర్యంలో సమావేశమై రూ. 21,760 జమ చేసి అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో సలాం దేవురావు, కాత్లే హుస్సేన్‌రావు, భక్తు రాజన్న, రాజమని, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘పేదలకు అండగా ఉంటాం’


ఇంటింటికీ ప్రచారం చేస్తున్న గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌రూరల్: అధికారంలో, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఎప్పుడు పేదలకు అండగా ఉంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. బుధవారం మండలంలోని చాందా (టి) గ్రామంలో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ గురించి ప్రజలకు వివరిస్తూ.. కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వస్తే రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్, ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ ఆరె పోచ్చన్న, మాజీ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, లంక రాజు, వినోద్, మారుతి, సంతోశ్, సాయి చరణ్‌గౌడ్, మల్లయ్య, దండు మధుకర్, కన్న ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్నిరంగాల్లో ముందుండాలి


పట్నాపూర్ గ్రామాన్ని సందర్శిస్తున్న నీలాబాయి

బోథ్: ఆదివాసీలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యురాలు కుస్రం నీలాబాయి అన్నారు. బుధవారం మండలంలోని బాబెర, పట్నాపూర్ గ్రామాలను ఆమె సందర్శించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అన్ని ఆరా తీశారు. సీఎం కేసీఆర్ గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలపారు. ఆయా కార్యక్రమాల్లో బాబెర, పట్నాపూర్ సర్పంచులు సురేశ్, పంద్రం సుగుణ, సార్మెడి భీంరావ్, తొడసం నీలకాంత్, రామ్‌గోపాల్, రాంచందర్, సుంగన్న, అనిల్, సుశీల, ఆత్రం మారుతి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వడ్డీ వ్యాపారం

- ముందుగానే వడ్డీ కట్
- ఆర్థికంగా నష్టపోతున్న పేదలు



ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ ఫైనాన్స్ అధిక వడ్డీల వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో పేద, మధ్య తరగతి అమాయక ప్రజలు మోసపోతున్నారు. తమ అవసరాల కోసం పైసా పైసా కూడబెట్టి, చిట్టీలు కడుతున్నారు. వారి కష్టాన్ని కొంతమంది నిర్వాహకులు కాజేస్తున్నారు. ఇక అప్పుగా తీసుకుంటే అధిక వడ్డీలతో నడ్డి విరుస్తున్నారు.

అధిక వడ్డీతో..

ఎవరికైనా సొమ్ము అవసరం ఉంటే వడ్డీ వ్యాపారి దగ్గరకు వెళ్తే ముందుస్తుగానే అధిక వడ్డీ తీసుకొని మిగతాది ఇచ్చేస్తారు. రోజు వారీగా, వారానికి నిర్ణయించిన మేరకు డబ్బులు కట్టాల్సిందే. ఉదాహరణకు ఓ వ్యక్తి రూ. 10వేలు తీసుకుంటే ముందుగానే రూ. 1,000 వడ్డీగా తీసుకుంటారు. మిగితా రూ. 9వేలు ఇస్తారు. తీసుకున్న అసలులో ఎలాంటి మినహాయింపు లేకుండా మొత్తం రూ. 10వేలు చెల్లించాలి. రోజువారీగా, వారానికి ఒకసారి మళ్లీ చెల్లించాల్సి ఉంటుంది. సకాలంలో చెల్లిస్తున్న వారికి కూడా నెలసరి, వారానికి చెల్లించే చిట్టీల నిర్వాహకులు సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదు.

నియంత్రిస్తేనే మేలు..

ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న వడ్డీ వ్యాపారాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి వాటితో చిరు, వీధి వ్యాపారులు, దినసరి కూలీలు, రైతులు నష్టపోతున్నారు. వారి అవసరాలకు వడ్డీతో తీసుకుంటున్న బాధితులు ఎవరికి చెప్పాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. దందాను అరికడితే ప్రజలకు మేలు జరుగుతుంది.

కఠిన చర్యలు తీసుకుంటాం



వడ్డీ వ్యాపారం కొనసాగుతున్నట్లు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఎక్కడైనా వడ్డీ వ్యాపారం, అధిక వడ్డీ వసూళ్లు చేస్తున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అలాంటి వ్యాపారం కొనసాగితే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి.

– రఘుపతి, సీఐ, ఆదిలాబాద్ రూరల్

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

జైనథ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ జావేద్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 30లోగా పాఠశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండుసెట్ల జిరాక్స్ కాపీలు అందించాలన్నారు. టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డ్, రెండు ఫొటోలతో పాఠశాలకు రావాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

బోథ్: మండలంలోని నక్కలవాడ గ్రామంలో హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ విజయ్ కుమార్, ఎంపీటీసీ జుగాదిరావ్, గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులందరూ కలిసి రూ.10 లక్షలతో ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వారు తెలిపారు.

బహిరంగ సభకు తరలిరండి

బోథ్: జనజాతి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఆదిలాబాద్‌లోని రాంలీలా మైదానంలో జరిగే గిరిజన సంస్కృతిక పరిరక్షణ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు, న్యాయవాది పంద్రం శంకర్ కోరారు. బుధవారం మండలంలోని పట్నాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తొడసం కైలాస్, తొడసం గోపాల్, నాగోరావ్, జంగుబాపు, సంతోశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

బోథ్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించడంతో ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో కలిసి మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజకు తరలిరండి

బోథ్: ఈనెల 29వ ఆదిలాబాద్‌లో మాదిగ సంక్షేమ సంఘం భవన నిర్మాణ భూమిపూజకు అందరూ తరలిరావాలని నాయకులు కోరారు. బుధవారం సొనాలలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజన్న, ప్రధాన కార్యదర్శి నాగన్న, మనోజ్, అశోక్, అనిల్, ఆడెల్లు, రాజశేఖర్, శంకర్, దినేష్, ప్రశాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

నేరడిగొండ: ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను బుధవారం అప్పీల్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి, సెరికల్చర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రాథోడ్ పార్వతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

ఆదిలాబాద్‌అర్బన్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడాలని బీఆర్ఎస్ యువ నాయకుడు జోగు మహేందర్ అన్నారు. పట్టణంలోని ఖానాపూర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న నవగ్రహాల నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నలగంటి నవీన్, వెంకటేశ్, అయూబ్, అబుజర్, చిన్న పటేల్, మహేందర్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ముధోల్: మండల కేంద్రంలో కలెక్టర్, ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు బుధవారం క్షయ నిక్షయ్ దివాస్ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ వెంకటరావు రాజేందర్ మాట్లాడుతూ ప్రజలకు క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా దగ్గు, జ్వరం వంటి లక్షణాలుంటే సమీపంలోని ఆశావర్కర్లను సంప్రదించాలన్నారు. వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందవద్దని.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందిస్తారని పేర్కొన్నారు. క్షయ రహిత దేశంగా మార్చేందుకు అందరం కృషి చేద్దామన్నారు. వైద్యులు ఆకాశ్, సాయిసువర్ధన్, హెడ్‌నర్సు పద్మలత, ల్యాబ్ టెక్నీషియన్ ప్రకాశ్ పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సూర్యవంశీ విద్యాసాగర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రాంలీలా మైదానంలో జూన్ 6న నిర్వహించే బహిరంగ సభకు విజయవంతం చేయాలని అఘాడి పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యవంశీ విద్యాసాగర్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్ రెడ్డిని కలిసి, సభ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సిద్దార్థ్, ఉపాధ్యక్షుడు నూజర్ ఖాద్రి, దివంకర్ జబాడి, కార్యకర్తలు ప్రకాష్, విఠల్, వైశాలి, రేష్మా పాల్గొన్నారు.